సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



చిరుత ఎదురుపడితే..
అడవిలోకి వెళ్లినప్పుడు చిరుతపులి ఎదురుపడితే ఏం చేయాలి. దాని బారి నుంచి ఎలా తప్పించుకోవాలి అనే అంశాలను జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు వివరించారు. 8లో▸



ఆశల సమస్యలు పరిష్కరించాలి
ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రాలు అందజేశారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0 /26.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి వేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతిదిశగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

దశాబ్ది వనం లక్ష్యాన్ని పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రామకృష్ణాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కోటి మొక్కల దశాబ్ది వనం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని ఈ నెల 26లోగా సాధించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి వనంలో గురువారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేయడంతోపాటు మొక్కల సంరక్షణకు ప్రత్యేక బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. భావితరాలకు సహజసిద్ధమైన ప్రకృతిని అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని సమష్టిగా విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధికారి శేషాద్రి, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పార్కు సందర్శన
మందమర్రిరూరల్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కేసీఆర్ పార్కును కలెక్టర్ సంతోష్ గురువారం పరిశీలించారు. పనులు ఎలా సాగుతున్నాయో అధికారులు అడిగి తెలుసుకున్నారు. దశాబ్ది వనం లక్ష్యాన్ని చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు సూచించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని తెలిపారు.

'పేదలకు అండగా ప్రభుత్వం'



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వేమనపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం మండలంలోని జిల్లెడ గ్రామ పంచాయతీలో పార్టీ అధ్యక్షుడు కోలి వేణుమాదవ్ ఆధ్వర్యంలో 69 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నీల్వాయివాగు, మత్తడి వాగు, బద్దెవెల్లి వాగు, ముల్కలపేట–రాచర్ల మధ్య ఉన్న బొందచేను ఒర్రె వాగులపై వంతెనలు సకాలంలో పూర్తి చేశామన్నారు. రుణమాఫీ, రైతుబంధు, బీసీబంధు, గృహలక్ష్మీ, ఉచిత విద్యుత్ దేశంలోనే ఎక్కడా లేవన్నారు. జిల్లెడ గ్రామంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. తహసీల్దార్ సదానందం, వైస్ ఎంపీపీ గణపతి, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశం, సీనియర్ నాయకుడు లక్ష్మీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లింగాగౌడ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ చేరిక
నీల్వాయికి చెందిన ఉప సర్పంచ్ నఫిజా అబిద్ ఖాన్, 10 మంది ఇతర పార్టీల నాయకులు మాజీ సర్పంచ్ రుద్రభట్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

పోలింగ్ కేంద్రాలు సందర్శించిన ఏసీపీ



ముదిగుంటలో పరిశీలిస్తున్న ఏసీపీ

జైపూర్: మండలం ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏసీపీ మోహన్ గురువారం సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలు, బీఎల్‌వోల నియామకాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిట్టపల్లి, ముదిగుంట, నర్వతోపాటు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు, వాటి పరిస్థితి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రమేశ్, ఎస్సై ఉపేందర్‌రావు, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

'టోల్' బాదుడే.. రోడ్డు పూర్తి కాలే!



జాతీయ రహదారి–363పై మందమర్రి పాత బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న వయాడక్ట్ వంతెన

- ఎన్‌హెచ్–363 నిర్మాణంలో అదే జాప్యం
- మరోమారు వచ్చే ఏడాది జనవరికి గడువు పొడగింపు
- రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు శూన్యం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణలో తీవ్ర అలసత్వం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారి–363 పనులు నాలుగేళ్లు అవుతున్నా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఓ వైపు రోడ్డుపై ప్రయాణం చేస్తున్నందుకు టోల్ వసూలు.. మరోవైపు పూర్తి కాని చోట పనులు సాగుతున్నాయి. రెండేళ్లలో పూర్తి కావాల్సిన రోడ్డు నిర్మాణం కరోనా, తర్వాత కూడా గడువు పొడగిస్తూనే ఉన్నారు. గత ఏడాది ఆగస్టు వరకే పూర్తి కావాలి. కానీ ఈ ఏడాది ఆగస్టు గడుస్తున్నా అందుబాటులోకి రాలేదు. మరోసారి జనవరి వరకు పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌కు గడువు ఇచ్చారు.

ఏళ్లుగా నిర్మాణంలోనే..



వర్షాలకు సోమగూడెం చర్చి సమీపంలో రోడ్డు నుంచి సమీప భూముల్లోకి చేరిన వరద(ఫైల్)

రాజీవ్ రాష్ట్రీయ రహదారిని శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి మహారాష్ట్ర సరిహద్దు కుమురంభీం జిల్లా వాంకిడి మండలం గోయగాం వరకు జాతీయ రహదారిగా మార్చుతూ 2016లో కేంద్రం గెజిట్ ఉత్తర్వులు ఇచ్చింది. 2017లో పని ఉత్తర్వులు, 2018లో భూ సేకరణ, 2019లో బిడ్డింగ్ పూర్తయ్యాయి. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో రెండేళ్ల నిర్మాణం, 15ఏళ్ల నిర్వహణ చేపట్టాలి. రెండు భాగాలుగా మొత్తం 94.602కిలోమీటర్లు నిర్మించాలి. కాంట్రాక్టర్ రూ.1356.90 కోట్లకు బిడ్ వేయగా.. అదనపు పనులతో నిర్మాణ వ్యయం రూ.1948కోట్లకు చేరింది. జిల్లాలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి తాండూర్ మండలం గోయగాం వరకు 42కిలోమీటర్లు నిర్మించాలి. గత ఏడాదిగా పది శాతం పనుల నిర్మాణమే చేస్తున్నారు. వాస్తవానికి ఈ పనులు 24 నెలల్లో అంటే 2022 ఆగస్టులోపే చేయాలి. నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే రోజుకు రూ.5లక్షల చొప్పున కాంట్రాక్టర్ పరిహారం వేయాలనే నిబంధనలు కూడా ఉన్నాయి. ఆ కాంట్రాక్టర్ గడువు పెంచాలని కనీసం కోరకున్నా అధికారులే జనవరి వరకు పెంచేందుకు ఆసక్తి చూపినట్లు సమాచారం.

రక్షణ చర్యలు కరువు
నిర్మించిన రోడ్డుకు టోల్‌ప్లాజా నుంచి రోజు రూ.లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు. ప్రయాణికులకు అవగాహన, భద్రత చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు. శ్రీరాంపూర్ బైపాస్ రోడ్డు, బెల్లంపల్లి బైపాస్ రోడ్డుపై రాత్రివేళ వెలుతురు సరిగా లేక భారీ వాహనాలు అదుపు తప్పుతున్నాయి. బోయపల్లి బోర్డు, కన్నాల, సోమగూడెం చర్చి సమీపంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్తగా రోడ్డు వేయడంతో అతివేగంతోనూ కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల నియంత్రణకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చర్యలు తీసుకోవాలి. కానీ ఇప్పటివరకు అవేమీ చేపట్టడం లేదు. సిగ్నల్స్, మలుపులు, భద్రత సూచికలు, రాత్రివేళ రేడియం స్టిక్కర్లు మెరిసేవి, అంబులెన్స్, ప్రథమ చికిత్స కిట్లు, టోల్‌ప్లాజా వద్ద జనరల్, మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. ఇవేమీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. నెలలో రెండుసార్లు ఉన్నతాధికారులు స్థానిక డ్రైవర్లు, వాహనదారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఇక వర్షాలు కురిస్తే సోమగూడెం, గాంధారి వనం సమీపంలో డ్రెయిన్స్ సరిగా లేక సమీపంలో వరద నీరు చేరుతోంది. వాహనదారుల భద్రత కోసం ప్రత్యేక కన్సల్టెన్సీ పర్యవేక్షణకు నిధులు మంజూరవుతున్నా ఖర్చుకు అలసత్వం వహిస్తున్నారు.

'టోల్' మాత్రం వసూళ్లు
గత ఏడాది డిసెంబర్ నుంచే రోడ్డుపై ప్రయాణం మేరకు టోల్ వసూళ్ల పేరుతో మొదలు పెట్టారు. రెండు సార్లు ధరలు రివైజ్ చేశారు. వచ్చే ఏడాది మార్చిలో మారోమారు పెరగనున్నాయి. ఈ టోల్ నుంచి ఏడాది సుమారుగా రూ.10కోట్లకు పైగానే వసూళ్లు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రమాదాల నివారణతోపాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

జాప్యంతో ఇబ్బందులు



మందమర్రి పాత బస్టాండ్ వద్ద వంతెన నిర్మాణం జాప్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ జామ్‌తోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్తగా పిల్లర్లు వేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం మంచిదే కానీ, జాప్యం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా పూర్తి చేయాలి.
– కొట్టె కొమురయ్య, మందమర్రి

వచ్చే జనవరిలో పూర్తి చేస్తాం
మందమర్రి వద్ద రోడ్డు నిర్మాణం ఉన్న చోట ఉన్న పైపులు మార్చడంలో జాప్యం ఏర్పడింది. దీంతో అక్కడ నిర్మాణంలో జాప్యం జరిగింది. వచ్చే జనవరి వరకు పనులు పూర్తి చేసేందుకు గడువు ఉంది. రోడ్డుపై వెళ్లేటప్పుడు వాహనదారులు నిబంధనలు పాటించాలి. రోడ్డు భద్రత చర్యలపై స్థానిక పోలీసు, ఆర్టీఏ అధికారులతో అవగాహన చేపడతాం.
– కే.ఎస్.అజయ్‌మణికుమార్, పీడీ, ఎన్‌హెచ్‌ఏఐ, మంచిర్యాల

నిరుద్యోగుల్లో డీఎస్సీ ఆశలు



మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్ణయించడంతో నిరుద్యోగుల్లో డీఎస్సీ ఆశలు చిగురిస్తున్నాయి. టీచర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ రెండ్రోజుల్లో విడుదల చేయనున్నామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఉద్యోగాల భర్తీని టీఎస్‌పీఎస్సీ టీఆర్టీ ద్వారా కాకుండా గతంలో మాదిరిగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2017 టీఆర్‌టీ నోటిఫికేషన్ ఇచ్చినా కోర్టు కేసుల కారణంగా రెండేళ్లకు పోస్టుల భర్తీ అయ్యాయి. తర్వాత నోటిఫికేషన్ ఇవ్వలేదు. జిల్లాలో 472 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తేల్చారు. ఈ క్రమంలో గురువారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేసిన డీఎస్సీ ప్రకటన నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తిస్తోంది.

పోస్టుల భర్తీ ఇలా..
2017లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ద్వారా టీఆర్‌టీ నోటిఫికేషన్ ఇచ్చారు. న్యాయపరమైన సమస్య తలెత్తడంతో పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేయాలంటే టెట్ అర్హత సాధించే నిబంధనలున్నాయి. డీఎస్సీ రాయాలంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష తప్పనిసరి కావడంతో 2022 జూన్ 12న ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహించారు. జిల్లాకు చెందిన అభ్యర్థులు పేపర్–1 పరీక్ష 11,161 మందికి గాను 10,360 మంది రాయగా 3,897 మంది అర్హత సాధించారు. పేపర్–2లో 7,932 మందికి గాను 7,284 మంది పరీక్షకు హాజరు కాగా 4,060 అర్హత సాధించారు. ఇప్పటికే జిల్లాలో 472 ఖాళీలు ఉన్నట్లు లెక్క తేల్చి ఉన్నతాధికారులకు నివేదించారు. ఇందులో పదోన్నతి ఖాళీలు, రిక్రూట్‌మెంటు ఖాళీలు ఉంటాయి. ఎట్లా తీసుకుంటారు..? ఎలా అనేది స్పష్టత లేకుండా పోయింది. ఎన్ని ఖాళీలు భర్తీ చేస్తారనేది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. విధి విధానాలు వస్తే గానీ స్పష్టత రాదని ఓ అధికారి తెలిపారు.

కాంగ్రెస్ టికెట్‌కు ఆశావహుల పోటీ

- గాంధీభవన్‌లో నాయకుల అర్జీలు
- నేడు చివరి రోజు
- దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం



మాజీ ఎమ్మెల్సీ పీఎస్సార్ తరఫున గురువారం దరఖాస్తు ఇస్తున్న పార్టీ నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అసెంబ్లీ టికెట్ల కోసం జిల్లా నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గాల నుంచి ఆసక్తి గల నాయకులు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం గాంధీభవన్‌లో దరఖాస్తులు అందజేస్తూ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. ఈ నెల 18నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా.. 25 వరకు ప్రక్రియ కొనసాగనుంది. శుక్రవారం చివరి రోజు కావడంతో మంచి రోజనే నమ్మకంగా భారీగా దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఆశావహులు తమ వినతులు సమర్పించి వస్తున్నారు. ఇప్పటికే జిల్లా నుంచి పదుల సంఖ్యలో అందజేశారు. ఇందులో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ దరఖాస్తు చేసుకున్నారు. తనకు బీఆర్‌ఎస్ నుంచి టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖరారు చేసుకుని ముందస్తుగానే అర్జీ సమర్పించారు.

చెన్నూరు నుంచే భారీగా...
ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన చెన్నూరు టికెట్ కోసం ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే రామిళ్ల రాధిక, డాక్టర్ రాజారమేశ్, డాక్టర్ దాసరపు శ్రీనివాస్, ఆయన సతీమణి విద్యావతి దరఖాస్తులు ఇచ్చారు. వీరితోపాటు ఓయూ విద్యార్థి నాయకుడు దుర్గం భాస్కర్, మరో నాయకుడు దుర్గం నరేశ్ ఉన్నారు. ఇక పార్టీలో చేరకున్నా స్వతంత్రంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న జిల్లా నేతకానీ సంఘం నాయకులు దుర్గం అశోక్ సైతం పార్టీ టికెట్ కోసం విన్నవించారు. శుక్రవారం సాయంత్రం వరకు ఒక్క చెన్నూరు నియోజకవర్గం నుంచే 13వరకు దరఖాస్తులు అందినట్లు తెలిసింది. ఇక బెల్లంపల్లి నుంచి రోడ్డ శారద, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చిలుముల శంకర్ దరఖాస్తు చేసుకున్నారు. ఇక మంచిర్యాల నియోజకవర్గం కోసం మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు తరఫున జిల్లా నాయకులు గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. సీనియర్ నాయకులు కేపీ ప్రతాప్, మందమర్రి నుంచి భాషా వేశారు. శుక్రవారం డాక్టర్ నీల కంఠేశ్వరరావు, మరో నాయకుడు ముత్తె సత్తెన్న వినతులు ఇవ్వనున్నారు. ఇక బెల్లంపల్లి టికెట్ కోసం మాజీ మంత్రి వినోద్ సైతం దరఖాస్తు చేసే అవకాశం ఉంది. దరఖాస్తుల స్వీకరణకు చివరి రోజు కావడంతో ఇంకా ఎవరైనా జిల్లా నుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు నాయకులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిలో ఉద్రిక్తత



రఘునాథ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మంచిర్యాలటౌన్: ముంపు ప్రాంత ప్రజలకు వరద నష్ట పరిహారం చెల్లించాలని, భవిష్యత్‌లో వరదలు రాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించారు. పోలీసులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు, ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, బీజేపీ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. నాయకులను అరెస్టు చేసి నస్పూర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న వారిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ రఘునాథ్ తీవ్రంగా మండిపడ్డారు. మూడేళ్లుగా పట్టణాన్ని వరుదలు ముంచెత్తుతున్నా శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని అన్నారు. వేలాదిగా ఇళ్లు నీటమునిగి కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని, ఇంతవరకు వరద బాధితులకు పరిహారం చెల్లించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అగల్ డ్యూటి రాజు, తుల ఆంజనేయులు, పట్టి వెంకటకృష్ణ, బోయిని హరికృష్ణ, తోట తిరుపతి, బండి మల్లిఖార్జున్, మద్ది సుమన్, కొండ వెంకటేశ్, సిరికొండ రాజు, విజయ్, ప్రదీప్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఎన్సీపీ పోటీ



మంత్రి ధర్మారావు బాబాకు సన్మానం

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) పోటీ చేస్తుందని ఆ పార్టీ అహేరీ ఎమ్మెల్యే, మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆత్రం ధర్మారావు బాబా అన్నారు. గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను పార్టీ కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను బరిలో ఉంచుతామని తెలిపారు. మహారాష్ట్రను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో తమ సత్తా చూపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుమ్మిడి గోపాల్, నితీష్, యువరాజ్, క్రాంతి, ప్రవీణ్, వంశీ, సల్మాన్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో కార్యకర్తల సమావేశం
బెల్లంపల్లి: మహారాష్ట్ర అహిరి ఎన్సీపీ ఎమ్మెల్యే ధర్మారావు బాబా గురువారం బెల్లంపల్లి కి వచ్చారు. స్థానికంగా నిర్వహించిన ఎన్సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ నిర్మాణం, ఎన్నికల అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దెల శ్రీనివాస్, శ్రేణులు పవన్‌కుమార్, ప్రదీప్, శ్రీనివాసరాజు, యాసిన్, రఘు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

నస్పూర్: భారత వజ్రోత్సవాల సందర్భంగా నిర్దేశించుకున్న మొక్కలు నాటే లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో డీఆర్‌డీఓ బి.శేషాద్రితో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, దశాబ్ది వనంలో మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 3 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. లక్ష్యాలను ఈ నెల 26 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలి
బెల్లంపల్లి: ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా రెండో ఓటరు జాబితాను తప్పులు లేకుండా తయారు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ పోలింగ్ అధికారులకు సూచించారు. గురువారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపుల కోసం దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు సరిగా ఉండేలా చూసుకోవాలని, కేంద్రాల మ్యాపింగ్, రూట్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. బెల్లంపల్లి ఆర్డీవో కాసబోయిన సురేష్, తహసీల్దార్ సుధాకర్, ఏఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

డుమ్మా టీచర్లపై కొరడా..!

- సర్కారు బడుల్లో ఇష్టారాజ్యంగా సెలవులు
- నిబంధనలు పాటించని వారిపై విద్యాశాఖ చర్యలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో డుమ్మా టీచర్లపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వారి వివరాలు సేకరిస్తోంది. నెలల తరబడి బడికి వెళ్లని వారిపై కొరడా ఝళిపించేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలో 2,383 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. సెలవులపై వెళ్లే వారి వివరాలపై ఏ రోజుకారోజు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అనుసంధానం లేకపోవడంతో అంతా మామూలుగా సాగుతోంది. ఏదైనా అవసరాల రీత్యా సెలవులు పెట్టాలనుకున్నా పొడిపొడిగా వాట్సాప్‌లో ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో నెల రోజుల తర్వాత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సెలవులపై వెళ్లిన ఉపాధ్యాయుల వివరాలు పంపిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు హెచ్‌ఎంలను మచ్చిక చేసుకుని మూడు రోజులుంటే ఏదో రెండ్రోజుల సెలవులుగా మార్చి నెల రోజుల తర్వాత స్కూల్ కాంప్లెక్స్‌లో పంపిస్తున్నట్లు తెలుస్తోంది. సెలవులు, డుమ్మా టీచర్ల విషయాలు అధికారులు తనిఖీలకు వెళ్తే తప్ప వెలుగు చూసిన సందర్భాలు తక్కువే. మరోవైపు కొన్ని ఉపాధ్యాయల సంఘాల నేతలు ఓడీ సౌకర్యం(సెలవుల అర్హత లేకున్నా) పేరిట డుమ్మాలు కొడుతున్నట్లు తెలిసింది. మరికొందరు ఉపాధ్యాయులు అవసరం లేకున్నా నెలల తరబడి ఇతర కార్యక్రమాల్లో కొనసాగుతూ విధులకు ఏగనామం పెడుతున్నారు.

ఆన్‌లైన్ హాజరు లేక..
ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల మినహా మిగతా మూడు జిల్లాల్లో బయోమెట్రిక్ హాజరు కొనసాగుతోంది. దీంతో ఉపాధ్యాయుల హాజరు ఇట్టే తెలిసిపోతుంది. జిల్లాలో ఆన్‌లైన్ హాజరు విధానం లేకపోవడంతో ఉపాధ్యాయుల అటెండెన్స్‌పై తెలియకుండా పోతోంది. టీచర్లు ఎన్ని రోజులకు సెలవు అనుమతి తీసుకున్నారు, గైర్హాజరువుతున్న రోజులు ఇతరత్రా సమాచారం లేకుండా పోతోంది. ఫేస్ యాప్ ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అమలులో జాప్యంతో ఆశించిన స్థాయిలో సమాచారం అందుకుండా పోతోంది. ఈ యాప్ ద్వారా డుమ్మా టీచర్లకు అడ్డుకట్ట వేయవచ్చు. ఉద్యోగరీత్యా విదేశాల్లో స్థిరపడిన పిల్లల వద్దకు కొందరు టీచర్లు వెళ్లి వస్తున్నారు. జిల్లాలో నలుగురు విదేశాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో పూర్తి వివరాలు డీఈవో కార్యాలయంలోనూ ఉండడం లేదు.

- వేమనపల్లి మండలం నీల్వాయి పాఠశాలలో ఐదుగురు టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకే రోజు ముగ్గురు సెలవులు పెట్టి గైర్హాజరయ్యారు. వాస్తవానికి ఇద్దరికే సెలవు ఇవ్వాల్సి ఉంది. ఈ నెల ఒకటిన పాఠశాల తనిఖీకి వెళ్లిన డీఈవోకు ముగ్గురు సెలవులో ఉన్నా విషయం తెలియడంతో వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు.
- జైపూర్ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఈ నెల 5న పాఠశాల సమయానికి విధులకు హాజరుకాకపోవడం, పిల్లలు సంఖ్య తక్కువగా ఉన్నా పట్టించుకోకపోవడంపై తీవ్రంగా పరిగణించి ఇద్దరు టీచర్లకు తాఖీదులు ఇచ్చారు. అదే రోజు చెన్నూర్ పాఠశాలలో మరో టీచర్‌కు షోకాజ్ నోటీస్.. పాఠశాల సమయంలో అందుబాటులో లేకపోయిన ఇంకో టీచర్‌ను సస్పెండ్ చేశారు.

బెటాలియన్‌లో ముగిసిన తనిఖీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో బెటాలియన్‌ల డీఐజీ ఎంఎస్.సిద్దిఖీ చేపట్టిన వార్షిక తనిఖీలు గురువారంతో ముగిశాయి. కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషాతో కలిసి బెటాలియన్‌లోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోని వివిధ రకాల వాహనాలు, వాటి పనితీరు, నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్ యూనిట్ ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు, రోగులకు అందుబాటులో ఉన్న సేవలు తెలుసుకుని, వైద్య పరికరాలు పరిశీలించారు. యూనిట్ స్టోర్ సందర్శించి నిత్యావసర, ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకాల వివరాలు తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రధాన కార్యాలయంలోని మినీస్టీరియల్ సిబ్బంది చేపడుతున్న రికార్డులను పరిశీలించడంతోపాటు వివిధ విభాగాల నిర్వహణ, పరిపాలన కార్యకలాపాలను పర్యవేక్షించారు. అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రిలోని సదుపాయాలపై ఆరా తీస్తున్న డీఐజీ

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూత
బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ సూర రజినికుమార్ తొమ్మిది నెలల క్రితం చింతలమానెపల్లిలో ప్రమాదవశాత్తు గన్ మిస్‌ఫైర్‌లో మృతిచెందాడు. అదనపు కార్పస్ ఫండ్ కింద మంజూరైన రూ.50 వేల విలువైన చెక్కును రజినికుమార్ తండ్రి కొమురయ్యకు డీఐజీ సిద్దిఖీ అందజేశారు.

క్లుప్తంగా

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్‌: హత్య కేసులో ఐదుగురు వ్యక్తులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.15 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ గురువారం తీర్పు చెప్పినట్లు కౌటాల సీఐ సాదిక్‌ పాషా, బెజ్జూర్‌ ఎస్సై విక్రమ్‌ తెలిపారు. 2009 సెప్టెంబర్‌ 28న బెజ్జూర్‌ మండలం రుద్రాపూర్‌కు చెందిన గుర్లే పెంటు (52) హత్యకు గురయ్యాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో గుర్లె ఇస్తారి, టాక్రె పోచయ్య మృతి చెందగా మిగిలిన ఆరుగురిలో వసాకే సంతోశ్‌, గుర్లే సాయినాథ్‌, గుర్లే లక్ష్మి, వసాకె బీంబాయి, టాక్రె తానక్కలను పోలీసులు కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

దాడి కేసులో ఒకరికి జైలుశిక్ష

మందమర్రిరూరల్‌(చెన్నూర్‌): 2017 ఆగస్టు 17న మండలంలోని ఊరు రామకృష్ణాపూర్‌కు చెందిన బొందుగుల కళావతిని కులం పేరుతో దూషించి, ఆమె సోదరుడు సల్లం రాంచందర్‌పై దాడి చేసిన రాపెల్లి నరేష్‌కు జిల్లా రెండో అదనపు సెషన్స్‌ జడ్జి శివరాం ప్రసాద్‌ రెండున్నర సంవత్సరాల జైలుశిక్షతో పాటు, రూ.3,500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పినట్లు మందమర్రి ఎస్సై చంద్రకుమార్‌ తెలిపారు. కళావతి ఫిర్యాదు మేరకు పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు పూర్వపరాలు పరిశీలించిన అనంతరం పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ కిరణ్‌ కుమార్‌ సాక్షులను ప్రవేశ పెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పుచెప్పారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

బెల్లంపల్లి: పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి కల్పన తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉంచిన ఎరువులు, పురుగు మందుల స్టాక్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గురిజాల గ్రామానికి వెళ్లి పత్తి పంటలను పరిశీలించారు.ఆమె వెంట బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, క్లస్టర్‌ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్‌ ఉన్నారు.

‘గొల్లవాగు’ వద్ద వెదర్‌స్టేషన్‌


ప్రాజెక్టు వద్ద వెదర్‌ స్టేషన్‌


భీమారం(చెన్నూర్‌): మండల కేంద్రానికి సమీపంలో గల గొల్లవాగు ప్రాజెక్ట్‌ వద్ద ఏర్పాటు చేసిన ఆటోమెటిక్‌ వెదర్‌స్టేషన్‌ పనులను గురువారం పూర్తి చేశారు. ఇప్పటికే ప్రాజెక్ట్‌లో ఆటోమెటిక్‌ వాటర్‌ లెవల్‌ స్టేషన్‌ ఏర్పాటు చేసిన ఇరిగేషన్‌ అధికారులు వాతావరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఆటోమెటిక్‌ స్టేషన్‌లో రికార్డు అయి వెనువెంటనే హైదరాబాద్‌లోని ప్రధాన కేంద్రానికి వెళ్తాయి. పూర్తిస్థాయి ఆన్‌లైన్‌ వ్యవస్థతో దీనిని ఏర్పాటు చేశారు. ఈస్టేషన్‌ ద్వారా గాలిలో తేమశాతం, వర్షం, గాలివేగం నమోదు అవుతాయని ప్రాజెక్ట్‌ ఏఈ శశాంక్‌రెడ్డి తెలిపారు.

చిరుత ఎదురుపడితే ఏం చేయాలి?

• ఎఫ్‌డీవో మాధవరావు సూచనలు


మాధవరావు

జన్నారం(ఖానాపూర్‌): ఎవరైనా అడవిలోకి వెళ్లినప్పుడు అకస్మాత్తుగా చిరుతపులి ఎదురుపడితే ఏంచేయాలి? దాని భారినుంచి ఎలా తప్పించుకోవాలి? అనే అంశాలపై డెప్యూటీ కన్జర్వేటర్‌, జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు పలు సూచనలు చేశారు. ఇటీవల తిరుమలలో కాలినడకన వెళ్లిన బాలికను చిరుత పులి హతమార్చిన సంఘటన చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో వాటి ద్వారా ప్రమాదం పొంచి ఉన్నప్పుడు తప్పించుకునే మెలకువల గురించి వివరించారు. ఆయన మాటల్లోనే..


చిరుతపులి (ఫైల్‌)

ఎదురుపడితే ఎలా తప్పించుకోవాలి?

దేశంలో పులుల సంఖ్య కంటే చిరుతల సంఖ్య ఎక్కువగా ఉంది. కవ్వాల్‌ టైగర్‌ జోన్‌లో సుమారుగా 80 వరకు చిరుతలు ఉన్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా చిరుత పులుల జాతి ఉంది. చిరుతలు జనావాసాల్లోకి ఊరికే రావు. వాటికి ఆహారం, నీటి సమస్యలు ఏర్పడినప్పుడు మాత్రమే జనావాసాల్లోకి వస్తాయి. చిరుత వేగంగా కదిలే జంతువు కావడంతో జనాల్లో ఎక్కువ అలజడి సృష్టిస్తుంది. జనాల మధ్య కు వచ్చిన చిరుతను బంధించడం సులువుకాదు. చిరుత పులి ఎంతదూరంలో ఎదురుపడిందన్న అంశంపై ప్రమాద తీవ్రత ఆధారపడి ఉంటుంది. దూరంగా ఎదురుపడితే సాధారణంగా అదే పక్కకు వెళ్లిపోతుంది. అలాంటి సమయంలో మనుషులపై దాడి చేయాల్సిన అవసరం చిరుతకు ఉండదు. అనుకోని పరిస్థితుల్లో అతి సమీపంలో ముఖాముఖిగా ఎదురుపడితే దాడి చేసే అవకాశాలున్నాయి. అలాంటి సమయంలో రెండు చేతులు పైకెత్తి గట్టిగా అరవాలి. అడవి జంతువుల సైకాలజీ ప్రకారం ఆకారంలో తమకన్నా పెద్దగా ఉన్న జంతువులపై సాధారణంగా చిరుతలు దాడికి దిగవు. చిరుత పులి ఎదురుపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తిరిగి పరుగెత్తడం, లేదా పొదల చాటున దాక్కోవడం లాంటివి చేయకూడదు. అలా చేస్తే చిరుత వెంటపడి దాడిచేసే అవకాశం ఉంది. ఒకవేళ పారిపోతే ఎంత పరుగెత్తినా చిరుత వేగం ముందు మనం నిలువలేం. కాబట్టి చిరుత కాస్త దూరంలో ఎదురుపడితే చేతులు పైకెత్తి నెమ్మదిగా వెనక్కి నడవడం, దగ్గరగా ఉంటే చేతులు పైకెత్తి గట్టిగా అరుస్తూ వెనక్కి నడిస్తే చిరుత అక్కడి నుంచి వెళ్లే అవకాశం ఉంటుంది. ఒకవేళ మనం చెట్లు ఎక్కినా వేటాడాలనుకునే చిరుత సులభంగా చెట్లు ఎక్కుతుంది.

కూలీలు ఏంచేయాలి?

అడవిలోకి పనికి వెళ్లే కూలీలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చిరుత పులి వెనుక వైపు నుంచి వేటాడుతున్నందున కూలీలు మాస్కులు, తలకు వెనుకవైపు ఫేస్‌ మాస్కులు పెట్టుకోవడం మంచిది. వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు ఫేస్‌ మాస్కులు ధరించి, మాట్లాడుకుంటూ వెళ్లాలి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చిరుత పులి బారి నుంచి తప్పించుకోవచ్చని మాధవరావు సూచించారు.

పిల్లి జాతి జంతువు

చిరుతపులి పిల్లి జాతికి చెందిన సిగ్గరి. మనుషుల కంట పడేందుకు ఇష్టపడదు. మనుషుల అలికిడి వినిపిస్తే దూరంగా వెళ్లిపోతుంది. సాధారణంగా ఫారెస్ట్‌ సఫారీకి వెళ్తే పులి కనిపిస్తుంది. కానీ చిరుతపులి కనబడటం చాలా తక్కువ. అది ఒంటరిగా నివసించేందుకు ఇష్టపడుతుంది. కలయిక సమయంలో సహచరిణితో, చిన్నపిల్లలతో ఉన్నప్పుడు ఎక్కువగా కనిపిస్తుంది. అడవిలో ఇవి గుహల్లాంటి ఆవాసాల్లో నివసిస్తాయి. జింకలు, సాంబర్లు, అడవి పందులను చిరుతలు ఎక్కువగా వేటాడుతాయి. పైకి చూస్తే శరీరంపై మచ్చలు చూడటానికి ఒకేలా కనిపించినా రెండు చిరుతలకు ఒకే విధంగా ఉండవు.

‘చలో హైదరాబాద్‌’ పోస్టర్లు విడుదల


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: సెప్టెంబర్‌ 3న హైదరాబాద్‌లో తలపెట్టిన పద్మశాలీ రాజకీయ శంఖారావం చలో హైదరాబాద్‌ పోస్టర్లను స్థానిక మార్కండేయ ఆలయంలో సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు, రాజకీయ విభాగం రాష్ట్ర కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్‌ ఈ సందర్భంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించడానికి పద్మశాలీలు కలిసికట్టుగా ఉద్యమించాలని అన్నారు. రాజకీయ శంఖారావం సభకు పద్మశాలీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీసంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గడ్డం సుధాకర్‌, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవసాని నాగరాజు, చిలువేరు సదానందం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సారంగపాణి, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు రాంసత్తయ్య పాల్గొన్నారు.

ఇస్రోలో చెన్నూర్‌ వాసులు


అనిల్‌కుమార్‌


శ్రావణ్‌కుమార్‌

చెన్నూర్‌: పట్టణానికి చెందిన చాచం అనిల్‌కుమార్‌, మోతె శ్రావణ్‌కుమార్‌ ఇస్రోలో శాస్త్రవేత్తలుగా పని చేస్తున్నారు. అనిల్‌కుమార్‌ మంచిర్యాలలో ఇంటర్‌, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్‌ పూర్తిచేశారు. శ్రీహరికోట ఇస్రోలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. చెన్నూర్‌ పట్టణానికి చెందిన మోతె శ్రావణ్‌కుమార్‌ ఒకటి నుంచి పదోతరగతి వరకు చెన్నూర్‌లో ఇంటర్‌, బీటెక్‌ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. ఇస్రోలో జూనియర్‌ శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు.

భవిత కేంద్రం సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న చౌదరి

తాండూర్‌: మండల కేంద్రంలోని భవిత (ఎంఆర్‌సీ) కేంద్రాన్ని గురువారం జిల్లా సెక్టోరల్‌ అధికారి చౌదరి సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువులో రాణించాలని సూచించారు. ఆయన వెంట ఐఈఆర్‌పీఎస్‌ ఆర్‌.వెంకటేశ్వర్లు, ఏఈ వినయ్‌, డి.సతీశ్‌ ఉన్నారు.

అర్హులందరికీ ప్యాకేజీ అందేలా చూస్తాం

• అదనపు కలెక్టర్‌ మోతీలాల్‌


అధికారులకు సమస్యలు వివరిస్తున్న వృద్ధురాలు

కాసిపేట(బెల్లంపల్లి): కాసిపేట మండలంలోని కేకే ఓసీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడెంలో అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ అందేలా చూస్తామని అదనపు కలెక్టర్‌ మోతీలాల్‌ పేర్కొన్నారు. గురువారం దుబ్బగూడెంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 293 మంది జాబితా చదివి వినిపించగా ఇంటికి నష్టపరిహారం ఇచ్చినా ప్యాకేజీలో పేరు లేదని చాలామంది తమ సమస్యలు అదనపు కలెక్టర్‌ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డులు, ఇతర పత్రాలు అందిస్తే విచారణ జరిపి అర్హులందరికీ న్యాయం జరిగేట్లు చూస్తానన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం 240 గజాల ప్లాట్‌ (నివాస స్థలం), నిర్మాణానికి రూ.లక్షా 25వేలు, వన్‌ టైం సెటిల్‌మెంట్‌ కింద రూ.5లక్షలు, నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు ఖర్చులకు, (ఎస్సీ, ఎస్టీలకు రూ.50 వేలు), ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.50 వేలు, రీసెటిల్‌ మెంట్‌కు రూ.50 వేలు మొత్తంగా రూ.7లక్షల 61వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.7లక్షల 75 వేలు అందించనున్నట్లు తెలిపారు. పాకలు, కొట్టాలకు అదనంగా రూ.25 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో సురేష్‌, మందమర్రి జీఎం మనోహర్‌, తహసీల్దార్‌ వేణుగోపాల్‌, కేకే ఓసీ పీవో రమేశ్‌కుమార్‌, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, సర్పంచ్‌ దేవి, తదితరులు పాల్గొన్నారు.

‘కార్మికులను బానిసలు చేస్తున్న ప్రభుత్వాలు’


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులను కార్పొరేట్‌ సంస్థ కాళ్ల కింద బానిసలుగా మారుస్తున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా అన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 29న ఇందిరాపార్క్‌ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం గోలేటి జీఎం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కోడ్‌లుగా కుదించి కార్మికులకు అన్యాయం చేశాయన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న కార్మికులు, ప్రజలను అణచివేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు శ్రీనివాస్‌, కార్యదర్శి సికిందర్‌, కార్మికులు పోచం, శ్రీనివాస కుమార్‌, పోసుబాయి, శకుంతల, సావిత్రి, మల్లేశ్వరి, ఓదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పీరీల బంగ్లా స్థలం కబ్జాకు యత్నం!


పీరీల బంగ్లా స్థలం

తాండూర్‌(బెల్లంపల్లి): మండల కేంద్రంలో దశాబ్దాలుగా పీరీల బంగ్లాగా ప్రసిద్ధిగాంచిన స్థలాన్ని కొందరు కబ్జాకు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాండూర్‌కు చెందిన గోపాల్‌కిషన్‌రావు దశాబ్దాల క్రితం తనభూమిని పీరీల బంగ్లాకు విరాళంగా అందజేసినట్లు సమాచారం. ప్రస్తుతం అట్టి భూమికి మార్కెట్‌ విలువ పెరగడంతో కొంతమంది ఉద్దేశపూర్వకంగా కబ్జాకు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్టి స్థలాన్ని అక్రమంగా అమ్ముకోవడానికి యత్నిస్తుండడం చర్చనీయాంశమైంది. ధరణి పోర్టల్‌లో మసీదు స్థలంగా నమోదై ఉన్నా అక్రమార్కులు కొందరు నాయకుల అండదండలతో స్వాహా చేయడానికి యత్నిస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు స్పందించి పీరీల బంగ్లా స్థలం కబ్జా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


కార్మికుడికి కండువా కప్పుతున్న రాజారెడ్డి

నస్పూర్‌: సీఎం కేసీఆర్‌ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సింగరేణి కాలరీస్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్‌ ఏరియాలోని ఆర్‌కే 6 గనిపై గేట్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు కార్మికులకు సొంతింటి పథకం, మారుపేర్లు సరిచేసుకోవడానికి అవకాశం, డిపెండెంట్ల వయస్సు పెంపు వంటి పలు హామీలు ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. సింగరేణిలో ఎన్నడూ లేని విధంగా మితిమీరిన రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ ప్రవేశపెట్టాలని, ప్రతీ ఏరియాకు ఒక ఇంటర్‌ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో బ్రాంచి ఆర్గనైజర్‌ వెంగల శ్రీనివాస్‌, గౌరవ అధ్యక్షుడు మిడివెల్లి శంకర్‌, బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు శ్రీపతి బానేష్‌, సాయిల శ్రీనివాస్‌, మహేశ్‌, వెంకటేశ్‌, రవీందర్‌, గంగాధర చారి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్‌: జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో రామ్మూర్తి, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ అల్లాడి శ్రీనివాస్‌, సబ్‌ యూనిట్‌ అధికారి నాందేవ్‌ కీటక జనిత వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం గురించి వివరించారు. ఎనాఫిలిస్‌, క్యూలెక్స్‌, ఏడిస్‌ దోమల వల్ల మలేరియా, బోదకాలు, మెదడు వాపు, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. నిల్వ నీటిలోనే దోమలు గుడ్లు పెడతాయని, ఇళ్లలోని నీటి డ్రమ్ములు, తొట్టిలలో కనిపించే తోక పురుగులే దోమ లార్వాలు అని వివరించారు. గుడ్డు దశ నుంచి దోమగా వృద్ధి చెందడానికి వారం రోజుల సమయం పడుతుందని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. ఇదే కార్యక్రమాన్ని పోస్ట్‌మెట్రిక్‌ బాలుర హాస్టల్‌, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. అల్ఫాసైఫర్‌ మెత్రిన్‌ అనే దోమల మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ సుజాత, స్టాఫ్‌నర్సు రమాదేవి, మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్‌ దమయంతి, వసతి గృహ సంక్షేమ అధికారి లక్ష్మణ్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ వసంత్‌ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ


విచారణ చేస్తున్న అధికారులు

వేమనపల్లి(బెల్లంపల్లి): పోడు పట్టాదారులు, గిరిజనులు, గిరిజనేతరుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న లింగాల ఎఫ్‌బీవో శ్రీనివాస్‌ వ్యవహారంపై కుశ్నపల్లి రేంజ్‌ అధికారి గోవింద్‌చంద్‌ సర్దార్‌ గురువారం విచారణ చేపట్టారు. ఈ నెల 2న ‘ఎఫ్‌బీఓపై చర్యలు తీసుకోవాలి’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఎఫ్‌ఆర్‌వోతో పాటు ఎఫ్‌ఎస్‌వో రవికుమార్‌, ఎఫ్‌బీవో పోచన్న జక్కెపల్లి శివారులోని కంపార్ట్‌మెంట్‌ 406 పోడు భూముల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు.

ఇండస్ట్రియల్‌ పీస్‌ శిక్షణకు బీపీఏ ఉద్యోగి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): ఎస్టీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రంలోని పూరీలో గురువారం నిర్వహించిన ట్రేడ్‌ యూనియన్‌ ఆఫ్‌ ఇండస్ట్రియల్‌ పీస్‌ శిక్షణ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డు సీహెచ్‌ అనిల్‌ హాజరయ్యారు. రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ శిక్షణలో భాగంగా సింగరేణిలోని శ్రీరాంపూర్‌, బెల్లంపల్లి, మందమర్రి, కొత్తగూడెం, మణుగూరు ఏరియాల నుండి ఒక్కో ఉద్యోగిని ఎంపిక చేయగా బెల్లంపల్లి ఏరియా నుండి అనిల్‌కు అవకాశం లభించింది.

‘నవోదయ’ దరఖాస్తులకు నేడే ఆఖరు

• 26, 27 తేదీల్లో సవరణలకు అవకాశం

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్‌ పట్టణంలోని త్రిశూల్‌ పహాడ్‌పై గల కేంద్రీయ జవహర్‌ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 25తో ముగియనుందని ప్రిన్సిపాల్‌ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తర్వాత మరోసారి గడువు పొడిగింపు ఉండదని, విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. కులం, పరీక్ష రాసే భాష, పట్టణ/గ్రామీణం తప్పుగా నమోదు చేసుకుంటే ఈ నెల 26, 27 తేదీల్లో ఆన్‌లైన్‌లో సవరణలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా పరిధిలో ప్రభుత్వ/ప్రైవేట్‌ పాఠశాల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

‘అసెంబ్లీకి ఆమడదూరంలో బీసీలు’

పాతమంచిర్యాల: బీఆర్‌ఎస్‌ పార్టీ బీసీలను అసెంబ్లీకి ఆమడదూరంలో ఉంచిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవి గుణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో 64 శాతం ఉన్న బీసీలకు కేవలం 23 అసెంబ్లీ స్థానాలు కేటాయించడం బాధాకరమన్నారు. మంచిర్యాల నియోజక వర్గంలో రెండు లక్షల బీసీ ఓటర్లు ఉండగా పదివేల ఓట్లు లేని సీఎం సొంత సామాజిక వర్గానికి సీటు కేటాయించడం దారుణమన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటరుగానే వాడుకుంటున్నాయన్నారు.

సీహెచ్‌పీలను సందర్శించిన కార్పొరేట్‌ జీఎం

నస్పూర్‌: శ్రీరాంపూర్‌ ఏరియాలోని సీహెచ్‌పీ, సీసీసీలోని సీహెచ్‌పీలను కోల్‌ హ్యాండ్లింగ్‌ ప్లాంట్‌ (కార్పొరేట్‌) జనరల్‌ మేనేజర్‌ సీహెచ్‌ నవీన్‌కుమార్‌ గురువారం ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జీఎంలు శ్రీరాంపూర్‌ ఓసీలో ఇన్‌పిట్‌ క్రషర్‌ లోడింగ్‌ సిస్టం, కన్వేయర్‌ బెల్టు పనివిధానం పరిశీలించారు. ఉపరితల గనులు, కోల్‌ హ్యాండ్లింగ్‌ ప్లాంట్‌ల నుండి బొగ్గు రవాణాను వినియోగదారులకు నిరంతరం రవాణా చేయాలని సూచించారు. శ్రీరాంపూర్‌ ఉపరితల గని ఉద్యోగులకు 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణా అత్యధికంగా చేసినందుకు బహుమతులు అందజేశారు. శ్రీరాంపూర్‌ సీహెచ్‌పీలో మొక్కలు నాటారు. అంతకు ముందు శ్రీరాంపూర్‌ జీఎం కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో కార్పొరేట్‌ జీఎం సీహెచ్‌ నవీన్‌ కుమార్‌ను ఏరియా జీఎం సంజీవరెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్‌ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏరియా జీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్లు ఎం.శ్రీనివాస్‌, పురుషోత్తంరెడ్డి, ఏజెంట్లు ఏవీరెడ్డి, గోపాల్‌సింగ్‌, రాముడు, అధికారులు డీవీ రావు, సుధీర్‌ జక్కుల వార్‌, తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌ సీహెచ్‌పీ వద్ద జీఎం నవీన్‌కుమార్‌